

బోధన్-పెద్దపల్లి రైలు పునఃప్రారంభం

బోధన్‌రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): బోధన్ నుంచి పెద్దపల్లి వెళ్లే డెమో ప్యాసింజర్ రైలు ప్రయాణికుల సౌకర్యార్థం పునఃప్రారంభించామని బోధన్ రైల్వే స్టేషన్ మేనేజర్ దీయావత్ రాము తెలిపారు. ప్రతిరోజూ బోధన్, రాకాసిపేట్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 4:15 గంటలకు రైలు ప్రారంభమవుతుందన్నారు. బోధన్ నుంచి నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల, కొండగట్టు, కరీంనగర్, పెద్దపల్లి వరకు వెళ్తుందన్నారు. అక్కడి నుంచి రామగుండం, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు రైలును పొడిగించామని స్టేషన్ మేనేజర్ తెలిపారు.



అభంగపట్నంలో మహిళా సంఘాల అధ్యక్షులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

జిల్లాలో వేగంగా ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటి వరకు 65వేల మెట్రిక్ టన్నుల సేకరణ
- 48గంటల్లో రైతులకు బిల్లుల చెల్లింపు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నవీపేట/ఎడపల్లి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేగంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని, ఇప్పటికే 65వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. శుక్రవారం నవీపేట మండలంలోని అభంగపట్నంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుత సీజన్‌కు సంబంధించి సన్నరకం, దొడ్డు రకం వరి ధాన్యం సేకరణకు వేర్వేరుగా 670కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని రోజుకు 15వేల నుంచి 18వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించడం జరుగుతుందని ఆయన వివరించారు. 48గంటల లోపు రైతులకు బిల్లులు చెల్లించే విధంగా ఓపీఎంఎస్ డాటా ఎంట్రీ జరిపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సన్న రకం ధాన్యం క్వింటాలుకు 2320రూపాయల చొప్పున ముందుగా చెల్లించడం జరుగుతుందని, అనంతరం రూ.500 చొప్పున బోనస్‌ను ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. ప్రతిరోజూ ఒక్కొక్క కేంద్రం నుంచి కనీసం 4నుంచి 5 లారీల లోడ్‌లను రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా అభంగపట్నం గ్రామంలో ధరణి, సాదాబైనామాకు సంబంధించిన పలు సమస్యలపై పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తేగా వచ్చే మంగళవారం నిజామాబాద్ ఆర్డీవోను అభంగపట్నం గ్రామానికి పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్, డీసీవో శ్రీనివాస్ రావు, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లై డీఎం రాజేశ్వర్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, నవీపేట సొసైటీ ఛైర్మన్ అబ్బన్న, ఏపీఎం భూమేష్ గౌడ్, గ్రామ సంఘం అధ్యక్షులు వినోద, ఉష తదితరులు పాల్గొన్నారు.

జానకంపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

యాసంగి ప్రణాళికకు కసరత్తు





• శ్రీరాంసాగర్ ప్రాజెక్టు



- ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్న ప్రాజెక్టు అధికారులు
- డిసెంబర్ చివరి వారం నుంచి ఎస్సారెస్పీ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు
- మిషన్ భగీరథతో పాటు తాగునీటికి 10టీఎంసీల వినియోగం
- డిసెంబర్ మొదటి వారం నుంచే నిజాంసాగర్ ఆయకట్టుకు అందనున్న సాగునీరు

నిజామాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర ప్రాజెక్టు ఆయకట్టు కింద యాసంగి ప్రణాళికకు కసరత్తు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు సిద్ధమవుతున్నారు. కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాలువల పరిధిలోని ఆయకట్టుతో పాటు ఎత్తిపోతల పథకాల కింద సాగునీరు అందించనున్నారు. వానాకాలం సాగు పూర్తికావడం ప్రాజెక్టులో ఫుల్ రిజర్వాయర్ లెవల్‌లో నీళ్లు ఉండటంతో మిషన్ భగీరథ మినహాయించి మొత్తం నీటిని సాగు కోసం వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు. గత యేడాది యాసంగిలో ఇచ్చిన విధంగానే ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏప్రిల్ వరకు యాసంగికి సాగునీరు అందించే విధంగా ఈ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈనెలలో హైదరాబాద్‌లో జరిగే శివం కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్న తర్వాత ఆయా జిల్లాల పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించి సాగుకు నీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. శ్రీరాంసాగర్‌తో పాటు నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో కూడా యాసంగిలో మొత్తం సాగుకు నీరు అందించే విధంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెల నుంచి ఈ ప్రాజెక్టు నుంచి కూడా యాసంగికి నీటిని అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నాలుగు దశాబ్దాలుగా ఆయకట్టుకు సాగునీరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉత్తర తెలంగాణ జిల్లాలో ఆయకట్టు ఉంది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో ఈ ప్రాజెక్టుకు ఆయకట్టు ఉంది. కాకతీయ కాలువ ద్వారా ఈ జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు నాలుగు దశాబ్దాలుగా సాగునీరు అందుతోంది. వానాకాలంతో పాటు యాసంగికి కూడా పంటలకు సాగునీరును అందిస్తున్నారు. కాకతీయ కాలువ పరిధిలో సుమారు తొమ్మిదిన్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఈ కాలువతో పాటు లక్ష్మి, సరస్వతి కాలువల ద్వారా మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలోని గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాల కింద మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. మొత్తంగా పదకొండున్నర లక్షల ఎకరాల వరకు యాసంగిలో సాగునీరు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నిండుగా నీళ్లు ఉండటం, వానాకాలం సాగు పూర్తికావడం వల్ల యాసంగి సాగుపై దృష్టి పెడుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. రైతులు వరికోతలు ఆయకట్టు పరిధిలో మొదలు పెట్టినందున ఈ ప్రణాళికను ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగే శివం కమిటీలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల ఆధారంగా ఆయకట్టును నిర్ణయించి అధికారులు సాగునీరు అందించనున్నారు.



• నిజాంసాగర్ ప్రాజెక్టు

ఎస్సారెస్పీలో పూర్తిస్థాయి నీటి మట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టం ఉంది. ప్రాజెక్టులో 1090 అడుగులకు గాను అంతే మొత్తంలో నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.501 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు కరీంనగర్‌లోని కాకతీయ కాలువకు అనుసంధానంగా ఉన్న లోయర్ మానేరు డ్యామ్‌లో 24 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. వరద కాలువకు అనుసంధానంగా ఉన్న మిడ్‌మానేరులో ఇరవై ఏడున్నర టీఎంసీల నీళ్లు ఉన్నాయి. కాకతీయ కాలువ పరిధిలో మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా మూడు ప్రాజెక్టులు నిండుగా ఉండటంతో పాటు పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉంది. కాకతీయ కాలువకు మొత్తం ఆయకట్టు తొమ్మిదిన్నర లక్షల ఎకరాలు ఉంది. ఈ ఆయకట్టుకు ఆన్ ఆఫ్ పద్ధతిలో సాగునీరు అందిస్తే 50 టీఎంసీల వరకు నీళ్లు అవసరం పడుతుంది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80 టీఎంసీలు నీళ్లు ఉన్నాయి. మిషన్ భగీరథకు 10 టీఎంసీల నీళ్లు మినహాయిస్తే మిగతా నీటిని ఆయకట్టుకు వినియోగిస్తారు. ప్రాజెక్టు పరిధిలో ఎల్‌ఎండీ ఎగువన మొత్తం 8లక్షల ఎకరాల వరకు కాకతీయ, లక్ష్మి, సరస్వతి, గుత్ప, అలీసాగర్ పరిధిలో సాగు అవుతుంది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలో 50 టీఎంసీల వరకు ఈ నీటిని వినియోగించనున్నారు. కాకతీయ కాలువకు మరో 10 టీఎంసీల వరకు యాసంగి సాగుకు ఎల్‌ఎండికి తరలించనున్నారు. మిగతా నీటిని ప్రాజెక్టులోనే నిలువ ఉంచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వరి కోతలు ఈ నెలాఖరులోపు

మిగతా 8వ పేజీలో...

మాధవనగర్ రైల్వే గేట్ వద్ద తరచూ ట్రాఫిక్ జాం

- పాత గేటు మొరాయించడంతో తొలగింపు
- నూతన గేటు ఏర్పాటు చేసినా.. పనిచేయని వైనం
- కొనసాగుతున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు
- వాహనాల రాకపోకలకు తప్పని ఇక్కట్లు

8



నాసిరకంగా రోడ్డు మరమ్మతు పనులు

- తల్వేద రోడ్డు పనుల్లో లోపించిన నాణ్యత
- ఇంకా పోయని సైడ్ బరమ్స్
- ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ పనులు
- కరువైన అధికారుల పర్యవేక్షణ

7





ఏసీబీకి చిక్కిన వర్ని ఎస్సై

- స్టేషన్ బెయిల్ కోసం రూ.50 వేలు డిమాండ్
- రూ.20వేలు తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్సై కృష్ణ కుమార్

వర్ని(కోటగిరి), నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వర్ని ఎస్సై కృష్ణ కుమార్ ఓ కేసులో స్టేషన్ బెయిల్ కోసం రూ.20వేల రూపాయల లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. వర్ని మండలంలోని కోటయ్య క్యాంప్‌కు చెందిన నాగరాజు అనే వ్యక్తి వద్ద స్టేషన్ బెయిల్ కోసం రూ.50వేలను ఎస్సై డిమాండ్ చేశారు. అయితే బాధితుడు రూ.20వేలకు ఎస్సైతో రాజీ కుదుర్చుకున్నాడు. అనంతరం ఈ విషయమై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఎస్సైని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఐదు రోజుల క్రితం వర్నికి చెందిన శ్రీకాంత్‌తో నాగరాజుకు చిన్నపాటి గొడవ జరిగింది. ఈ ఘటనలో శ్రీకాంత్ తలకు గాయమైంది. దీంతో శ్రీకాంత్ నాలుగు రోజుల పోలీస్ స్టేషన్‌లో నాగరాజుపై ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై కృష్ణకుమార్ నాగరాజుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నాగరాజు స్టేషన్ బెయిల్ కోసం ఎస్సైని ఆశ్రయించడంతో తనకు రూ.50వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బుల కోసం ఎస్సై పలుమార్లు నాగరాజుకు ఫోన్ చేశారు. తన వద్ద అంత డబ్బు లేదని రూ.20వేలు మాత్రమే ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం బాధితుడు నాగరాజు.. ఏసీబీ అధికారులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని వివరించారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మూడు రోజులుగా ఎస్సై కృష్ణకుమార్‌పై నిఘా పెట్టారు. శుక్రవారం బాధితుడు ఏసీబీ అధికారులు ఇచ్చిన డబ్బులను తీసుకుని స్టేషన్‌కు వెళ్లాడు. పోలీస్ స్టేషన్‌ప్రాంగణంలో వాహనం ఎక్కే సమయంలో ఎస్సైకి డబ్బులు ఇస్తున్న క్రమంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సైని ఏసీబీ కోర్టుకు తరలిస్తామని అధికారులు తెలిపారు.

ఎస్సై కృష్ణకుమార్‌పై అనేక అవినీతి ఆరోపణలు..

వర్ని ఎస్సై కృష్ణకుమార్‌పై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ కేసులోనూ చేయి తడపనిదే ఫైలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. జూదం, మొరం, పీడీఎస్ బియ్యం, ఇసుక నడిపే వారు నెలవారి మామూలు ఇవ్వాలిందే. డబ్బులు ఇవ్వని వారిపై కఠినంగా వ్యవహరించడంలో ఎస్సై వెనకాడేవారు కాదని సిబ్బంది సైతం బాహాటంగానే ఆరోపిస్తున్నారు. డబ్బుల వసూళ్ల కోసం ప్రైవేటుగా ఓ వ్యక్తిని నియమించుకుని తన అవినీతి, అక్రమాలు సాగించారు. ఈ యేడాది జూన్ నుంచి ఆగస్టు మధ్యలో అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను స్టేషన్‌కు తరలించారు. సిబ్బంది కంట పడకుండా వాటిని దొంగచాటుగా ప్రైవేటు వ్యక్తితో బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. గతంలో మోస్రా, చందూర్ ప్రాంతాల్లోనూ ఇసుక టిప్పర్లను ఆపి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో స్టేషన్‌లో పని చేసే ఓ కానిస్టేబుల్ సైతం కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. తన అవినీతి, అక్రమాలకు సిబ్బంది అడ్డు రాకుండా ఉండేందుకు వారిని బందోబస్తు పేరుతో దూర ప్రాంతాలకు పంపించే వారని సమాచారం. తన అవినీతి, అక్రమాలు బయట పడకుండా ఇటీవల పలువురు కానిస్టేబుళ్లను సైతం బదిలీ చేయించడంలో ఎస్సై హస్తం ఉన్నట్లు సమాచారం. అయితే ఎస్సై ఏబీసీకి చిక్కడం వర్ని ఉమ్మడి మండలంలో చర్చనీయాంశంగా మారింది.

రేపటి నుంచి నిజామాబాద్‌కు వెళ్లే వాహనాల దారి మళ్లింపు

- నెల రోజుల పాటు కొనసాగనుందన్న అధికారులు

ఆర్మూర్‌రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, ఆర్మూర్ జాతీయరహదారిపై వెళ్లే వాహనాలను దారి మళ్లించనున్నారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి రైల్వే పై ఓవర్‌బ్రిడ్జి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 10వ తేదీ నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు నెల రోజుల పాటు నిజామాబాద్, ఆర్మూర్ మార్గంలో వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్‌కు వచ్చే భారీ వాహనాలు డిచ్‌పల్లి హైవే మీదుగా ఆర్మూర్‌కు వెళ్లాల్సి ఉంటుందని, అదే విధంగా ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వెళ్లే భారీ వాహనాలు 44వ జాతీయ రహదారి మీదుగా నిజామాబాద్ నగరానికి వెళ్లాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు చిన్నాపూర్, కల్లెడి, ఆలూర్ మీదుగా ఆర్మూర్‌కు చేరు కోవాలని, అలాగే ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వెళ్లే బస్సులు సైతం అదే రూట్‌లో వెళ్లాలని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ధాన్యం అమ్ముకున్న మిల్లర్లపై చర్యలు!

- జిల్లాలో సీఎంఆర్ ఇవ్వని పలు మిల్లులు
- బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన అధికారులు
- రెండేళ్లలో కేటాయించిన రూ.120 కోట్ల ధాన్యం పక్కదారి
- 49 మిల్లులకు నోటీసులు జారీ
- ఓ మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన మిల్లులవే అధిక బకాయిలు

నిజామాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సీఎంఆర్ (కస్టమ్ మిల్లుడ్ రైస్) కింద కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే ఆయా మిల్లులను ఇప్పటికే బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. ధాన్యం తీసుకొని సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి బియ్యం అందించని మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. కొన్ని మిల్లుల్లో ధాన్యం నిల్వలు కేటాయింపులకు అనుగుణంగా లేకపోవడం తో రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకునేం దుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎనిమిది మిల్లులపై పోలీసు కేసులు సైతం నమోదు చేశారు. బియ్యం ఇవ్వని మిల్లర్ల నుంచి అంతే మొత్తంలో డబ్బులు వసూలు చేసేం దుకు చర్యలు చేపడుతున్నారు. నోటీసులకు స్పందిం చని మిల్లర్లపైనా రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్య లు తీసుకోవడంతో పాటు ఆస్తులను జప్తు చేసేం దుకు సిద్ధమవుతున్నారు. గతంలో పనిచేసిన ఓ మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన మిల్లులతో పాటు ఇతర మిల్లులు కూడా ఉండటంతో ఈ సీజన్‌లో వీటికి ధాన్యాన్ని కేటాయించవద్దని నిర్ణయించారు. మిగతా మిల్లులకు గ్యారంటీ తీసుకొని కేటాయింపులు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 330 రైస్‌మిల్లులు

జిల్లాలో మొత్తం 330 రైస్‌మిల్లులు ఉన్నాయి. ఇందులో బాయిల్డ్ మిల్లులతో పాటు రా రైస్‌మిల్లులు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో ప్రతీ సీజన్‌లోనూ 4లక్షల ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ విస్తీర్ణానికి అనుగుణంగా 11లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వస్తుండడంతో.. ప్రతీ సీజన్‌లో ఆరు నుంచి ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల వరకు అధికారులు కొనుగోళ్లు చేస్తున్నారు. జిల్లాలోని మిల్లులకు అధికారులు కెపాసిటీకి మించి ఎలాంటి గ్యారంటీలు లేకుండానే కేటాయింపులు చేశారు. సీఎంఆర్ కింద క్వింటాలుకు 67 కిలోల బియ్యాన్ని ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ప్రతీ సీజన్‌లో ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు, మిల్లర్ల ఒత్తిళ్లకు అనుగుణంగా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ గ్యారంటీ తీసుకొని ఈ కేటాయింపులు చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని కొందరు రైస్ మిల్లర్లు సీఎంఆర్‌కు అనుగుణంగా బియ్యాన్ని నిర్ణీత సమయంలో అందించగా.. మరికొందరు రైస్‌మిల్లర్లు ఆలస్యంగా సీఎంఆర్ కింద బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇచ్చారు. ఇంకొందరు మిల్లర్లు మాత్రం నిబంధనలను పాటించకుండా బియ్యాన్ని ఇవ్వలేదు. వాయిదాలు వేస్తూ నాలుగు సీజన్‌లలో ధాన్యం తీసుకున్నారు. ఆ తర్వాత మొత్తం ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. జిల్లాలోని ఓ మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన నాలుగు మిల్లులకు కేటాయించిన ధాన్యం పెద్ద మొత్తంలో పక్కదారి పట్టింది. గత ప్రభుత్వం హయాంలో సదరు నేత హవా కొనసాగడంతో.. ధాన్యం కేటాయింపులు చేసిన మేరకు బియ్యాన్ని అందించలేదు.

రూ.కోట్లల్లో విలువ చేసే ధాన్యం పక్కదారి

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి మిల్లులతో పాటు ఇతర మిల్లులకు 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరంలో సీఎంఆర్ కింద అధికారులు ధాన్యం కేటాయింపులు చేశారు. ఈ నాలుగు సీజన్‌లో సుమారు రూ.120 కోట్ల విలువైన ధాన్యాన్ని కేటాయింపులు చేశారు. సదరు మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన మిల్లులకే రూ.60కోట్లకు పైగా ధాన్యాన్ని కేటాయించినట్లు అధికారులు గుర్తించారు. నాలుగు సీజన్‌లలో కేటాయించిన ధాన్యానికి సంబంధించి బియ్యాన్ని అందించలేదు. అధికారులు

మిగతా 8వ పేజీలో...



బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో సీఎం జన్మదిన వేడుకలు



సాలూర మండల కేంద్రంలో పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థినులు



నవీపేటలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

బోధన్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బోధన్ పట్టణం, బోధన్, సాలూర మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పాషా మొయినోద్దీన్, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, ధూప్ సింగ్, పౌల్, జహీర్, దామోదర్, బడు, సాయిలు, సాలూరలో సాలూర మండల అధ్యక్షులు మందర్నా రవి, అల్లె జనార్ధన్, అల్లె రమేష్, కేజీ గంగారాం, శ్రీనన్న, సౌక్యం రవి, లక్ష్మణ్, నాగరాజు, ఇల్తెపు రమేష్, గౌస్, బుద్దె లక్ష్మణ్, మందర్నా లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నవీపేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నిరుపేదలకు రగ్గులు, దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భగవాన్, మోస్రా సాయిరెడ్డి, గంగాధర్, ముస్తాక్, మోహన్, సంజీవ రెడ్డి, గోపాల్, మూసా, సుజాత పాల్గొన్నారు.

కోటగిరి: ఉమ్మడి మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు మనోహర్, మధు, షాహీద్, బర్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ కాంగ్రెస్ నాయకులు జావీదోద్దీన్, సాయిరెడ్డి, ధనుంజయ్, నితిన్, కార్తీక్, ఎంఎల్ రాజు, కృష్ణ, అంజయ్య, హాజీ ఖాన్, సురేష్ పటేల్ పాల్గొన్నారు.

మెండోర: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇటువంటి జన్మదిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలు అందించాలని భగవంతున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెప్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, డీసీసీ జనరల్ సెక్రెటరీ సోం రాజేందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దిసాయి, కొప్పెల మోహన్, డీసీ గంగయ్య, సోం రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని కస్తూర్బ పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను విద్యార్థినుల మధ్య కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సీఎం జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మాజీ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, పుప్పాల అశోక్, గిర్మాజీ గంగాధర్, గడ్డం అనిల్, గిర్మాజీ గోపి, శెట్‌పల్లి ఆనంద్, మామిడి శ్రీనివాస్, అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచు కున్నారు.

కమ్మర్‌పల్లి: స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థుల మధ్య కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినులకు నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పడిగెల ప్రవీన్, బుచ్చి మల్లయ్య, రేవతి గంగాధర్, సింగిరెడ్డి శేఖర్, తెడ్డురమేష్, వేముల గంగారెడ్డి, అశోక్, అజహర్, పాష, గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు సంబురాలు జర పుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివ కుమార్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, బద్ధం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని టీచర్స్‌కాలనీలో డెఫండెమ్ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎం జన్మదిన కేక్ కట్ చేసిన అనంతరం పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, సాయిబాబాగౌడ్, కొంతం మురళీ, ఫయీం, స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, కోపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలు కేక్ కట్ చేసి సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.



కమ్మర్‌పల్లి కస్తూర్బా పాఠశాలలో



మోర్తాడ్‌లో కస్తూర్బా పాఠశాలలో..



మెండోరలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ నాయకుల చేరిక



కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈరవత్రి అనిల్

ముప్కాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల బీఆర్ఎస్ నాయకులు రియాజ్, ఖజీం, యూనీస్, మహ్మద్ వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ శుక్రవారం వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనతో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర సహకార యునియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్తెన్న, తౌటు గంగాధర్, నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం

రెంజల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎంఈవో ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సీవీ రామన్ జయంతి సందర్భంగా రెంజల్ ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలు, రంగోళి, లలిత, సంగీత పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విజయానంద రావు సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు గంగాధర్, అరుణ్, శేఖర్, పీడీ కృష్ణమూర్తి, మధుసూదన్, సాంబశివరావు, నర్సింహ రావు, అనుపమ, విజయ కిషోర్, ప్రసాద్, తదతరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఉచిత న్యాయసేవ

బోధన్‌రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఉచిత న్యాయసేవ అందించబడుతుందని శుక్రవారం బోదన్‌లో న్యాయసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అంబేద్కర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటి ఆధ్వర్యంలో అర్హులకు న్యాయ సహాయం ఉచితంగా అందజేస్తున్నట్లు పారా లీగల్ వాలంటరీ పద్మాసింగ్ అన్నారు. న్యాయసేవ సందర్భంగా పట్టణంలోని వివిధ కళాశాల విద్యార్థులతో ప్రధాన కూడళ్ల వద్ద నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వృద్దులు, మహిళలకు ఉచిత న్యాయసేవ అందించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవ సంస్థ పారా లీగల్ వాలంటీర్లు సాయేంద్ర జాదవ్, ప్రధానోపాధ్యాయులు కృష్ణ, రాజేష్ రెడ్డి, అధ్యాపకులు కిషోర్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

వేల్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లేకుంటే నేడు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా లేదని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంబవ చమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు ద్వారా కరెన్సీపై డాక్టర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని డిమాండ్ చేశారు. సగటు మనిషి వ్యక్తి కోణంలో నుంచి ఆర్థిక కోణాన్ని దృష్టిలో ఉంచుకొని 1935 ఏప్రిల్ 1న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయడం జరిగిందంటే అది కేవలం అంబేద్కర్ కృషి వల్లనే సాధ్యపడిందన్నారు. అందుకే కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు నర్సయ్య, కార్యవర్గ సభ్యులు గంగాధర్, అంజయ్య సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ అంకిత్



అంకాపూర్‌లో సర్వేను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



సాలూరలో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ఆర్మూర్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామంలో శుక్రవారం సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి, కుల గణన సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యూమారేటర్‌కు, పంచాయతీ కార్యదర్శి హారికకు సర్వేకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇంటింటికి స్టిక్కర్‌లు అతికించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్య క్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సయ్య, పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పుప్పాల హారిక, ఇన్యూమారేటర్లు పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. గ్రామంలోని 4,5 వార్డుల లో ఇళ్ళకు వేసిన స్టిక్కర్‌లను పరిశీలిస్తూ ఇంటి యజమానులను సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న సమగ్ర కులగణన ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, గ్రామకార్యదర్శి వినోద్, సూపర్‌వైజర్, ఏపీవో అశోక్, సీసీ రవి, ఎన్యూమారేటర్లు, తదితరులు ఉన్నారు.

సర్వేకు ప్రతీఒక్కరు సహకరించాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్: ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు పూర్తి సహకారం అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం సాలూర మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన్ డివిజన్‌లో ఇంటింటి సర్వే కోసం ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించబడకుండా ప్రతి ఇంటిని సర్వే జరపాలన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలోని రికార్డుల ఆధారంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించామన్నారు. ఒక్కో బ్లాక్‌కు ఒకరు చొప్పున ఎన్యూమలేటర్లను నియమించామని, ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాల్సిన తీరుపై వారికి శిక్షణ కల్పించామన్నారు. 9 నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభం అవుతుందని వివరించారు. సర్వే బృందానికి నిర్ణీత సమాచారాన్ని అందిజేస్తూ డివిజన్‌లో కుటుంబ సర్వే విజయవంతమయ్యేలా సహకరించాలన్నారు.

కుటుంబ సర్వే అంటూ సైబర్ నేరగాళ్ల మోసాలు ప్రజలు నమ్మొద్దు: సీఐ



బోధన్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వే జరుగుతున్న నేపథ్యంలో కొందరు సైబర్ నేరగాళ్లు కుటుంబ సర్వే చేస్తున్నామంటూ సైబర్ నేరగాళ్లు కాల్ లిస్ట్ పంపి ఓటీపీలు చెప్పామని అడుగుతున్నారని ఇలాంటి మోసాలు ప్రజలు నమ్మవద్దు పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇతర వ్యక్తుల నుండి ఓటీపీ చెప్పామని అడిగితే సంబంధిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు పూర్తి సహయ, సహకారాలు అందించాలన్నారు. కుటుంబ సర్వే పట్ల ఎలాంటి అపోహలు నమ్మొద్దని ఆయన పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్ సెంటర్‌లను పరిశీలించిన సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం ఆన్‌లైన్ సెంటర్‌ల నిర్వాహకులతో సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఇందులో భాగంగా ఎన్యూమలేటర్లు ప్రస్తుతం సర్వే కోసం ఇంటింటికి కుటుంబాలను గుర్తిస్తూ స్టిక్కర్లు వేస్తున్నారని, 9వ తేది నుండి అధికారులు పూర్తి నిబంధనల మేరకు ఎన్యూమరేటర్లు సర్వే చేయాలన్నారు. సర్వే చేసిన కుటుంబ వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లలో నమోదు చేయవాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సాలూర, బోధన్ మండలాల్లో ఎంపిక చేసిన ఆన్‌లైన్ సెంటర్‌లను పరిశీలించారు. ఆయన వెంట సాలూర తహసీల్దార్ శశి భూషణ్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాద్ పాఠశాలలో దంత వైద్య శిబిరం

మాక్లూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్రాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేఘన డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివే 200 మంది విద్యార్థులకు ప్రొఫెసర్ వెంగల్‌రావు ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, దంత వైద్యులు డాక్టర్ వైభవి, డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ స్నేహ, డాక్టర్ నవ్య, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

నవీపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన డాంగే లక్ష్మణ్ అనే 44సంవత్సరాల వ్యక్తి ఆచూకీ లభ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. గత ఆగస్టు నుండి లక్ష్మణ్ కనిపించకపోవడంతో ఇటీవల కుటుంబ సభ్యులు నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం డాంగే లక్ష్మణ్ నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆచూకీ లభించగా అతనిని నవీపేట పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. డాంగే లక్ష్మణ్ అదృశ్యం అయిన విషయం విధితమే.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

బోధన్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష పడిన ఘటన బోధన్‌లో చోటు చేసుకుందని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. గురువారం మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని బోధన్ పోలీసులు కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ న్యాయమూర్తి శేషతల్ప సాయి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి ఒకరోజు జైలు శిక్షతో పాటు 500రూపాయల జరిమాన విధించారని పట్టణ సీఐ తెలిపారు.



ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారితో పాటు ధర్మకర్తలను ప్రమాణ స్వీకారం చేయించి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాయన్నారు. బోధన్ చక్రేశ్వరాలయానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు, చరిత్ర ఉందన్నారు. దేవాలయాలు సూచి, శుభ్రత పాటిస్తూ భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తులు దేవాలయానికి వస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయాల్లో మనస్ఫూర్తిగా పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. బోధన్ నియోజకవర్గంలోని దేవాలయాలను అభివృద్ది చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్ రావు, పాషా మొయినోద్దీన్, దేవాదాయ శాఖ ఈవో రవీందర్ గుప్తా, వేద పండితులు గణేష్ శర్మ, ధర్మకర్తలు లక్ష్మణ్, కమల భూమేష్, కవిత, సూర లింగం, నగేష్ పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి కృషి చేస్తాం

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



ఆర్మూర్ గూండ్లచెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవన ఉపాధి కోసం చేపలు పట్టే గంగపుత్రులు ప్రభు త్వం ద్వారా పొందే అన్ని పథకాలకు అర్హులని వారి అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో 190చెరువుల్లో సుమారు 27లక్షల 96 వేల చేప పిల్లలను విడుదల చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆర్మూర్‌లోని గూండ్ల చెరువులో 55వేల చేప పిల్లలను వదిలామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. గతంలో 100శాతం చేప పిల్లలను విడుదల చేస్తే ఈ సంవత్సరం 50శాతం విడుదల చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. బీజేపీ ప్రభుత్వం మత్స్యకారులకు 75శాతం సబ్సిడీపై వాహనాన్ని అందజేసిందన్నారు. చెరువులు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, కబ్జా అయిన చెరువులను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ అధికారి ఆంజనేయులు, బింగి పెంటయ్య, చిన్నారెడ్డి, కంచెట్టి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ రూరల్ లోని పెగడాపల్లి, ఊటపల్లి, రెంజల్ మండలంలోని నీలా, ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మ తులు చేపడుతున్న దృష్ట్యా నేడు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

నవీపేట : నవీపేటలోని 33/11సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల పాటు జన్నేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్‌ల మరమ్మత్తులలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



క్షత్రీయ కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సోమనాథం

ఆర్మూర్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని నార్కోటిక్స్ డీఎస్పీ సోమనాథం అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం గంజాయి, మత్తుపదార్థాలు నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్స్ డీఎస్పీ సోమనాథం మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలు వినియోగించిన, సరఫరా చేసిన అక్రమ రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటిపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీస్ విభాగాలను ఏర్పాటు వ్యాపారాలను అరికట్టడానికి నిరంతరం నిఘా పెట్టామన్నారు. విద్యాసంస్థల్లో గంజాయి లాంటి మత్తుపదార్థాలు విద్యార్థులు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడేందుకు విద్యాసంస్థలు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాల విక్రయంపై సమాచారం అందించడానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలన్నారు. మత్తుపదార్థాలు నియంత్రించడంలో ప్రతీఒక్కరు సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంజాయి నిర్మూలన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ పాండే పాల్గొన్నారు.

14 గ్రామాల చెరువుల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ

వేల్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని 14 గ్రామాల్లో ఉన్న 40చెరువుల్లో 2024-25 గాను ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మండలంలోని 14 గ్రామాల్లో 40చెరువుల్లో మొత్తం 6లక్షల 69వేల 375 చేప పిల్లలను వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకార్మికుల శ్రేయస్సు కోసం పట్టుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, వేల్పూర్ సహకార సంఘం డైరెక్టర్ రాజేందర్, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ దామోదర్‌గౌడ్, మల్లేష్, రమణ, వినోద్, రవి, రాము, స్వరూప, ఇంద్రగౌడ్, చరణ్, భగవన్‌దాస్, మల్లా రెడ్డి, ఏఈవోలు, ఫిషర్‌మ్యాన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి



కలశాన్ని ఊరేగిస్తున్న వేద పండితులు, గ్రామస్థులు

భక్తివాడగా బాన్సువాడ

- మైలారం గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


నసురుల్లాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు భక్తి మార్గంలో నడుస్తున్నాయని, బాన్సువాడ భక్తివాడగా మారుతోందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే, ఛైర్మన్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో గుడులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. తద్వారా ఆయా గ్రామాల ప్రజలు దైవ చింతనతో గుడులను మంచిగా కట్టుకుంటున్నారన్నారు. అనంతరం ఆలయంలోని యజ్ఞశాలలో పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, గ్రామస్తులందరూ భక్తి మార్గంలో ముందుకు నడవాలని సూచించారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెర్క శ్రీనివఆస్, మాజీ సర్పంచ్ సాయిరాం యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యులు జగన్, కర్ణం భాస్కర్, ధూళి శంకర్, రాము, కనుగుంట్ల శ్రీను, అల్లం రాములు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

యజ్ఞశాలలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం





ఆంధ్రజ్యోతి ఫోకస్



అతుకులు.. గతుకులు
ఇవే(ం) మరమ్మతులు

- తల్వేద రోడ్డులో లోపించిన నాణ్యత
- ఇంకా పోయని సైడ్ బరమ్స్
- కంకర రోడ్డును తలపిస్తున్న వైనం
- కరువైన అధికారుల పర్యవేక్షణ

నందిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లోని రోడ్లను బాగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను మంజూరు చేస్తుంటే కొందరు అవినీతి అధికారుల లాలూచీ, కాంట్రాక్టర్ల కక్కుర్తి వల్ల సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు. ఇందుకు నిదర్శనం తల్వేద రోడ్డే. సుమారు ఏడాది క్రితం పోసిన కంకర, తారు అప్పుడే పోయింది. పైపైగా పోసిన డాంబర్ చిన్నపాటి వర్షపు చిరు జల్లులకే కొట్టుకుపోయింది. పెద్ద గుంతలు ఏర్పడి రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. వాటికి మళ్లీ చేపట్టిన మరమ్మతులూ తూతూ మంత్రంగా చేపట్టారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత లోపించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా 5 ఫీట్ల వెడల్పు మట్టి పోయాలి

- పెర్కిట్ సాయరెడ్డి, మాజీ ఉపసర్పంచ్, తల్వేద



తల్వేద తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించింది. ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో సదరు కాంట్రాక్టర్ రోడ్డు పనులు ఇష్టాతీరిన చేశారు. తారు రోడ్డుకు ఇరువైపులా 5 ఫీట్ల చొప్పున సైడ్ బరమ్స్ (మట్టి) వేయాల్సి ఉంటుంది. కొద్దిదూరం పాటు ఫీటు మందంతోనే మట్టిపోసి చేతులు దులుపుకున్నారు. లక్షల రూపాయల ప్రజాధనం మట్టిపాలైంది. జిల్లాస్థాయి అధికారులు స్పందించి నాణ్యతతో పనులు చేపట్టాలి. లేనిపక్షంలో నాలుగు గ్రామాల ప్రజలతో ఆందోళన చేస్తాం.

నందిపేట-జన్నేపల్లి వరకూ అధ్వానంగా..

నందిపేట-జన్నేపల్లి మెయిన్ రోడ్డు నుంచి దేవిపట్నం, చింరాజ్‌పల్లి, లక్కంపల్లి మీదుగా తల్వేద గ్రామం వరకు తారు రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వం రూ.74లక్షలు మంజూరు చేసింది. మెంటెనెన్స్ ఆప్ రూరల్ రోడ్స్ గ్రాంట్‌కింద మంజూరైన నిధులతో సుమారు 3.6 కిలోమీటర్ల మేరకు తారు రోడ్డు వేశారు. ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వం, పనులు దక్కించుకున్న శ్రీ సాయిశక్తి కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగా కారణంగా రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేకపోయారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆరు మాసాలకే కంకర తేలి మట్టి రోడ్డును తలపిస్తోంది. పెద్ద గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరిగాయి. సైడ్ బరమ్స్ పోయకపోవడంతో వాహనాల వేగానికి తారు కొట్టుకుపోతోంది. అయా గ్రామాల ప్రజల ఆందోళనతో ఆంధ్రజ్యోతి మినీలోనాణ్యతకు తూట్లు అనే శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బి అధికారులు శ్రీసాయిశక్తి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఆదేశాలు ఇచ్చారు. దీంతో సదరు కాంట్రాక్టర్ నాణ్యతతో చేపట్టాల్సిన మరమ్మతులను తూతూ మంత్రంగా చేపట్టారు. తారు రోడ్డుకు మధ్యలో ఏర్పడ్డ గంతలను పూడ్చారు. రోడ్డుకు ఇరువైపులా తారు కొట్టుకుపోవడంతో అక్కడక్కడ మళ్లీ తారును పోసి అతుకులు అద్దారు. మళ్లీ సైడ్ బరమ్స్ పోయకుండా వదిలేశారు. దీంతో తల్వేద తారు రోడ్డు పరిస్థితి ఎక్కడ వేసి గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. నాసికరం రోడ్డు నిర్మాణంలో పర్యవేక్షణ చేయని ఆర్‌అండ్‌బీ అధికారులపై అలాగే నిబంధనలు పాటించకుండా తారు రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని దేవి పట్నం, చింరాజ్‌పల్లి, లక్కంపల్లి, తల్వేద గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.



ఇటీవల మరమ్మతులు చేపట్టిన తల్వేద తారు రోడ్డు ఇలా..



27 వార్డులో ప్రకృతివనంలో పెరిగిన పిచ్చిమొక్కలు

పట్టణ ప్రకృతి వనాల

నిర్వహణ ఏదీ?

- కామారెడ్డిలో అధ్వానంగా పట్టణ ప్రకృతివనాలు
- రూ.లక్షలు పెట్టి ప్రకృతివనాలు ఏర్పాటుచేసిన నిర్వహణ కరువు
- పిచ్చిమొక్కలు,పొదలతో నిండిపోవడంతో ప్రజలకు అందని ఆహ్లాదం
- పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇదే పరిస్థితి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



కామారెడ్డిటౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మాదిరి పట్టణాలలో సైతం పచ్చదనంతో కూడిన ఆహ్లాదమైన వాతావరణం ప్రజలకు కల్పించాలని గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన పట్టణ ప్రకృతివనాలు వృధాగా మారుతున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఏర్పాటుచేసిన వనాలను పట్టించుకునే వారే కరవయ్యారు. ఖర్చు చేసిన నిధులు వృధా కావడంతో పాటు ప్రజలకు ఆహ్లాదం దూరమవుతోంది. కామారెడ్డి మున్సిపాలిటి పరిధిలో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటుచేసేందుకు ఆగమేఘాలమీద ఆతృత ప్రదర్శించిన అధికారులు వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేస్తున్నారు. పట్టణ ప్రకృతివనాలు ఏర్పాటుచేసినప్పుడు చూపిన శ్రద్ధ వాటి సంరక్షణపై మాత్రం చూపడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణంలోని అన్ని వార్డులకు చెందిన పట్టణ ప్రకృతివనాలతో పాటు పలు వార్డులలో క్రీడాప్రాంగణాలు పిచ్చిమొక్కలతో నిండిపోయి వాటిని ఏర్పాటుచేసినప్పటి రూపురేఖలు ప్రస్తుత రూపురేఖలకు పొంతన లేకుండా పోయింది. మొత్తం పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిన అసలు అటువైపు కన్నెతి చూసిన నాధుడే కరవయ్యాడని ఆయా ప్రాంతాల వాసులు పేర్కొంటున్నారు.

ప్రారంభంలో ఉన్న శ్రద్ధ.. సంరక్షణపై లేదు

ప్రజలకు పచ్చని వాతవరణంతో పాటు ఆహ్లాదాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ప్రకృతివనాలు ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీరుగారుతోంది. పల్లె ప్రకృతివనాల లాగే పట్టణ ప్రజలకు పట్టణ ప్రకృతివనాలు ఏర్పాటుచేయాలని గత ప్రభుత్వం ఆలోచన చేసి దాని కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టింది. దీంతో ప్రారంభంలోనే హడావిడి చేసి పార్కుల్లాగే మొక్కలను నాటేల చేసిన అధికారులు పచ్చటి వాతావరణం తీసుకోచ్చి వదిలేశారు. ప్రస్తుతం వాటి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఏర్పాటుచేసిన వార్డులలోని పట్టణ ప్రకృతి వనాలను పర్యవేక్షణ చేసి వాటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్న వాటి వైపు కన్నెతి చూడకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి అసలు ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితిలోకి చేరుతున్నాయి.

ఆహ్లాదం కరువు

పట్టణంలోని ఆయా వార్డులలో ఏర్పాటుచేసిన పట్టణ ప్రకృతివనాలు అసలు ప్రజలకు ఆహ్లాదం పంచడం కాదు కదా రోగాలకు నెలవుగా మారుతున్నాయి. కేవలం ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది కాబట్టి ఎక్కడ పడితే ఎక్కడ ఏర్పాటుచేసి వాటిని సంరక్షణ చర్యలు గాలికి వదిలేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని వార్డులలో మురికి కుంటల వద్ద ప్రకృతివనాలు ఏర్పాటుచేశారు. దీంతో పాములు, కీటకాలు, దోమలు ఆవాసాలు చేసుకుంటున్నాయి. కొన్ని వార్డులలో స్థలభావంతో ఇతర వార్డులలో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటుచేసిన అధికారులు వాటిని సైతం పట్టించుకోవడం లేదు. కేవలం పట్టణప్రకృతివనాలు ఏర్పాటుచేశామా మమ అనిపించేశామా అని మున్సిపల్ అధికారులు ఆలోచన చేస్తున్నారని...అవి ప్రజలకు ఉపయోగపడితే మాకేంటి...పడకపోతే మాకేంటి అనే ధోరణిలో అధికారులు ఉంటున్నారనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.





సరైన నిర్వహణ లేక ప్రకృతి వనాల్లో పేరుకున్న చెత్తాచెదారం, పెరిగిన పిచ్చి మొక్కలు



జర దేఖో!!

అస్తవ్యస్తంగా ఉన్న మోడల్ స్కూల్ రోడ్డు

అధ్వానంగా తిరుమల కాలనీ రోడ్డు

- ఏళ్లు గడుస్తున్నా వేయని రోడ్డు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెర్కిట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 7వార్డు తిరుమల కాలనీరోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. చినుకు పడితే రోడ్డు మరింత అధ్వానంగా మారి వాహనదారుల రాకపోకలకు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రజలు రైల్వేస్టేషన్‌కు వెళ్తుంటారు. కొన్ని సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ సమస్యలు విన్నవించినప్పటికీ కార్యరూపం దాల్చలేదని ప్రజలు వాపోతున్నారు. ఆర్మూర్‌లోని విలీన గ్రామాలు పెర్కిట్, మామిడిపల్లి గ్రామలలో మొదటి సారిగా శిలాఫలకం వేసింది ఈ రోడ్డుకేనని, కానీ అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శిలాఫలక వేసి ప్రారంభోత్సవం చేశారే కానీ ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వేయలేదని స్థానికులు చెప్తున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా టిప్పర్‌లు, వాహనాలు ఎక్కువగా ప్రయాణిస్తుండడంతో దుమ్ము, దుళి వాటి కలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పనులు చేయడానికి బాధ్యతలు తీసుకున్న రోడ్డు కాంట్రాక్టర్ పనులు చేయలేక చేతులెత్తేయడంతో రోడ్డు వేయలేకపోయామని, అధికారులు అంటున్నారు. రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేసి ఏళ్లు గడిచినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో ఆగ్రహించిన గుర్తుతెలియని వ్యక్తులు శిలాఫలకం ధ్వంసం చేశారు. అలాగే కాలనీలో కస్తూర్బాగాంధీ బాలికల వసతిగృహం ఉండడంతో విద్యార్థులు, అధ్యాపకులు తల్లిదండ్రులు ఈ రోడ్డు గుండా వసతిగృహానికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే పక్కనే ఉన్న మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు కూడా గుంతలతో అధ్వానంగా తయారైంది. కాలనీవాసులు, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు ఎన్నిసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించిన రోడ్డు నిర్మాణం జరగలేదని, వెంటనే రోడ్డునిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలు పడి అధ్వానంగా మారిన తిరుమలకాలనీ రోడ్డు

రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలి

- గంగాధర్, అధ్యక్షుడు, తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ



తిరుమల కాలనీ రోడ్డు నిర్మాణం గురించి పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి విన్నవించాం. సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో మట్టి రోడ్డు గుండా వాహన రాకపోకలతో వచ్చే దుమ్మూ దూళితో కాలనీవాసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డు వేయాలని కోరుతున్నాం.

యాసంగి ప్రణాళికకు కసరత్తు

(ఐదో పేజీ తరువాయి)

పూర్తై రైతులు నారుమళ్లను వేయడంతో పాటు డిసెంబరు చివరి వారం నుంచి వరినాట్లను మొదలు పెట్టే అవకాశం ఉన్నందున ఆలోపు సాగు ప్రణాళికను తయారు చేసి నీళ్లు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైతే శ్రీపాదసాగర్ నుంచి కూడా నీటిని మళ్లించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం యాసంగి ప్రణాళికకు కసరత్తు చేస్తున్నందున ముందస్తుగానే ఎస్సారెస్పీ సీఈ ఆధ్వర్యంలో ఈ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

నిజాంసాగర్ పరిధిలో 2లక్షల 20వేల ఎకరాల సాగు నీటికి ఏర్పాట్లు..

ఇదే రీతిలో నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు కూడా ఈ యాసంగిలో పూర్తిస్థాయిలో సాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 2లక్షల 20వేల ఎకరాల వరకు సాగునీటిని అందించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు ఈ సాగునీటిని అందించనున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీలో 17.802 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. యాసంగికి మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించిన ప్రాజెక్టులో ఇంకా సగానికి పైగా నీళ్లు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కంటే నెలరోజుల ముందుగానే ఈ ప్రాజెక్టు పరిధిలోని రైతులు సాగును మొదలు పెట్టనుండటంతో డిసెంబర్ మొదటి వారం నుంచే ఆయకట్టుకు నీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలీసాగర్ ఆయకట్టు వరకు సాగునీరు అందించే విధంగా సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ముందస్తుగానే యాసంగి సాగు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉందని వారు అన్నారు. వానాకాలం సాగు పూర్తయినందున యాసంగిపై దృష్టి పెట్టినట్లు వారు తెలిపారు.

ధాన్యం అమ్ముకున్న మిల్లర్లపై చర్యలు!

(ఐదో పేజీ తరువాయి)

తనిఖీలు చేసి కేసులు నమోదు చేసిన తర్వాత ఒక మిల్లుకు సంబంధించిన బియ్యాన్ని ధాన్యానికి అనుగుణంగా అందించారు. కానీ మిగతా మిల్లులకు సంబంధించిన బియ్యం ఇప్పటివరకు అందించలేదు. ఈ మిల్లులకు ధాన్యం కేటాయించిన తర్వాత వాటిని ఇతర మిల్లులకు మళ్లించారు. ఎన్నికలకు ముందుగానే అధికారికంగా ఇతర మిల్లులకు కేటాయించినట్లు ఒత్తిళ్లు చేసి ఎన్‌వోసీ తీసుకున్నారు. దానికి అనుగుణంగానే ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ మిల్లులకు సంబంధించిన విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టడంతో ధాన్యం లేనట్లు బయటపడింది. ఈ మిల్లులతో పాటు ఇతర మిల్లుల్లోనూ అధికారులు తనిఖీలు చేయడంతో పెద్ద ఎత్తున ధాన్యం పక్కదారి పట్టినట్లు బయటపడింది. ఈ మిల్లులతో పాటు మొత్తం 49 మిల్లుల్లో ధాన్యం పక్కదారి పట్టడంతో.. ప్రస్తుతం కొంతమేర వసూలు చేశారు. అధికారులు గుర్తించిన విధంగా రూ. 120 కోట్లలో సుమారు 40 కోట్ల రూపాయల వరకు రికవరీ చేశారు. ఇంకా రూ. 80 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని అధికారులు రికవరీ చేయవల్సి ఉంది. ధాన్యానికి సంబంధించి నోటీసులు ఇవ్వడంతో కొంతమంది మిల్లర్లు డబ్బులు చెల్లించేందుకు ముందుకు రాగా.. మరికొంత మంది బియ్యాన్ని అందించేందుకు గడువు కోరారు. నిర్ణీత గడువు ప్రకారం అందించని మిల్లులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ధాన్యానికి సంబంధించిన విలువను బట్టి ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి

సుభాష్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ వసూళ్లలో ఇబ్బంది పెడుతున్న వడ్డీ వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కోటగల్లిలోగల నీలం రాంచంద్రయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నగరానికి చెందిన తండ్రీ, కూతురు గోదావరిలో దూంకి మృతి చెందడం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. వీరి మరణానికి కారణమైన వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఫైనాన్స్, మైక్రో ఫైనాన్స్ జోరుగా సాగుతుందని నిరుద్యోగ యువతను ఉద్యోగాల్లో చేర్చుకొని వారిచేత వడ్డీ వసూళ్లు చేయిస్తున్నారని అన్నారు. వడ్డీలు ఇవ్వనివారిపై హింసా, దౌర్జన్యంతో పాటు అవహేళన చేయడం వల్ల అప్పు తీసుకున్న వారు అవమానంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. వడ్డీ, అసలు ఇవ్వనివారిపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, నాయకులు మురళి పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ

మోపాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని ఖానాపూర్‌లో తెలుగుదేశం పార్టీ జెండాను పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ ఆవిష్కరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేగాం యాదాగౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలో పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ కరుడుగట్టిన కార్యకర్తలు ఉన్నారని, ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతీ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్, చంద్రబాబు చేసిన అభివృద్ధి తప్ప నేటికి గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో అంబిక సత్యనారాయణ, నర్సింహారావు, దేవమ్మ, సురేష్, లవంగరాజు, లోలా ప్రసాద్, స్వామి, విష్ణు, నాగేశ్వర్‌రావు, నవీన్, లింగన్న, జలేందర్, గోపి పాల్గొన్నారు.

నర్సింగ్‌పల్లిలో పెద్దమ్మ తల్లి బోనాలు

మోపాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో శుక్రవారం పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం పాడి పంటలతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గ్రామంలో ఉన్న పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుందని పెద్దలు తెలిపారు. గ్రామం నుండి బోనాలతో పెద్దమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. ఈ బోనాల పండుగలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

మోపాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన కాలూరు ప్రసాద్‌రావు (43) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. కుటుంబ సమస్యలు, అప్పులు ఎక్కువ కావడంతో ప్రసాద్‌రావు తన పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. పొలం కోసేందుకు వెళ్లివస్తానని చెప్పి ఆత్మహత్యకు పాల్పడడంతో మృతుడి భార్య ఆవేదన వ్యక్తం చేసింది. పొలం వద్దకు వెళ్లిన వ్యక్తి చావు కబురు వస్తుందని ఊహించుకోలేదని ఆమె కన్నీరు మున్నీరుగా విలపించింది. ప్రసాద్‌రావుకు 8 నెలల కూతురు ఉంది. ప్రసాద్‌రావుకు 2 ఎకరాల పొలం ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఒకరి హత్య

ఖిల్లా, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వ్యక్తి హత్యకు గురైన ఘటన శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. మద్నూర్ మండలానికి చెందిన లక్ష్మణ్ (30) బతుకు దెరువు కోసం జిల్లా కేంద్రానికి వచ్చినట్లు స్థానికుల ద్వారా తెలిసిందని నగర ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. ఈఘటన నగర శివారులోని కాలూరు రోడ్‌లో జరిగినట్లు తెలిపారు. హత్య చేసిన దుండగుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

అందరికీ అందుబాటులో న్యాయసేవలు

- జిల్లా న్యాయ సేవాధికారి సునీత కుంచాల



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయసేవాధికారి

నిజామాబాద్ లీగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు, దళితులు, మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన అందరికీ న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా న్యాయసేవాధికారి సునీత కుంచాల అన్నారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ధర్నాచౌక్, రైల్వేస్టేషన్, తిలక్‌గార్డెన్ మీదుగా తిరిగి జిల్లా కోర్టు వరకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, విద్యార్థులు, పారా లీగల్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతల కారణంగా ఎవరు కూడా న్యాయ సేవలకు దూరం కాకూడదనే లక్ష్యానికి అనుగుణంగా న్యాయసేవల చట్టం రూపొందించారని ఆమె అన్నారు. న్యాయసేవల చట్టం పేర్కొనబడిన విధంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ తన అధికారిక విధులను నిర్వహిస్తుందని తెలిపారు. సివిల్, రాజీపడదగిన కేసులను పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఏర్పాటు చేసి సత్వర న్యాయం అందించేందుకు లక్ష్యంగా న్యాయసేవల ప్రస్థానం కొనసాగుతుందని వివరించారు. పోక్సో క్రిమినల్ కేసులలో కేసుల తీవ్రతను బట్టి ఆర్థిక పరిహారం అందిస్తున్నామని, హత్య కేసులలో తల్లిదండ్రులను కోల్పోయిన వారి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తుందని, మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా న్యాయమూర్తుల మధ్య మధ్యవర్తిత్వం నెరపి వారు ఒక అంగీకారం వచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కళాశాలల్లో, పాఠశాలల్లో లీగల్ లిటరసి క్లబ్‌లను ఏర్పాటు చేసి పుస్తకాలు, కరపత్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సంస్థ సూపరింటెండెంట్ శైలజరెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, బార్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, న్యాయవాదులు ఆశనారాయణ, రణదీష్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాల ఏర్పాటు

- రాష్ట్ర పర్యవేక్షణ అధికారి స్వామిరెడ్డి


తూంపల్లిలో పశు వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

ధర్పల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశువులకు సంబంధించి ఉచితంగా వ్యాధి నిరోధక, గాలికుంటు వ్యాధి చికిత్సలు చేస్తున్నామని రాష్ట్ర పర్యవేక్షణ అధికారి స్వామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో జరుగుతున్న పశువైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వైద్య శిబిరంపై సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బసరెడ్డి, కిరణ్ దేశ్‌పాండే, పశువైద్యాధికారి అభిషేక్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

సిరికొండ: గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం అధికారుల బృందం తనిఖీ చేశారు. సిరికొండ మండలంలోని తూంపల్లి గ్రామంలోని ఎడ్లకు, ఆవులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తుండగా రాష్ట్ర పర్యవేక్షణ బృందం అధికారి డాక్టర్ స్వామిరెడ్డి బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ రైతులతో పాడి పశువుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రైతులు ప్రతీ పశువుకు టీకాలు వేయించుకోవాలని డాక్టర్ స్వామిరెడ్డి సూచించారు. తూంపల్లి గ్రామంలో 194 ఆవులు, 295 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువైద్య సిబ్బంది వేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ బస్వారెడ్డి, కిరణ్ దేశ్‌పాండే, మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞా, పశువైద్య సహాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను విమర్శించడమే బీజేపీ పని'

నిజామాబాద్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలుగా అమలు చేస్తున్న ప్రతీ పథకంపై విమర్శలు చేయడమే బీజేపీ నాయకులు పనిగా పెట్టుకున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదంతో నరేంద్రమోదీ ప్రచారం చేసినప్పటికీ గత ఎన్నికల్లో బిజెపికి సీట్లు తగ్గాయని కాంగ్రెస్‌కు సీట్లు పెరిగాయని ఆయన అన్నారు. మోదీ వల్ల కానిది కిషన్‌రెడ్డి వల్ల ఏమవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ల నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. మూసీ ప్రక్షాళనకు వెయ్యి కోట్లు ప్రభుత్వం వద్ద ఉన్నాయి కానీ సర్పంచులకు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వడం లేదని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని బిఆర్ఎస్ హయాంలోనే సర్పంచులు నిర్లక్ష్యానికి గురయ్యారని ఇప్పుడు వారే సర్పంచుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ రమేష్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టిమేట్ కాపీలు తెలుగులో : ఎస్ఈ

సుభాష్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉండేందుకు ఎస్టిమేట్ కాపీలు తెలుగులోనే ఉండే విధంగా చూస్తామని నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ తెలిపారు. ఎస్టిమేట్ కాపీలు తెలుగులో ఉండే విధంగా రైతులకు ఎస్ఎంఎస్ రూపంలో రిలీజ్ చేయడం జరిగిందన్నారు. ఇకపై రైతులు గమనించ విషయం ఏమిటంటే ఏ పని గురించి ఎటువంటి సామాగ్రిని రైతు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పనికి కేటాయించిన ఏజెన్సీ వారే చేయాల్సిన పని పూర్తి చేస్తారన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించే దిశగా ఎన్‌డీసీఎల్ కంపెనీ కార్యచరణ రూపొందించిందన్నారు. విద్యుత్ అధికారులు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ ఉన్న విద్యుత్ సమ స్యలను పరిష్కరించే కార్యక్రమమే విద్యుత్ అధికారుల పొలం బాట అన్నారు. ఈ కార్యక్రమంలో వంగిన స్తంభాలు, లూజ్ లైన్‌లను సరిదిద్దుతారన్నారు. మోటార్లకు కెపాసిటర్లను పెట్టుకోవాలని అవగాహన కల్పిస్తారని అన్నారు. కెపాసిటర్లు అమర్చడం ద్వారా మోటార్లు మరింత కాలం మన్నికగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. దాంతో పాటు లో వోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. ఆటోస్టార్టర్‌లను తొలగించాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న స్తంభాలను 9.1 మీటర్ల ఎత్తు వరకు పెంచుతామన్నారు. రైతులకు మరింత నాణ్యమైన మెరుగైన సేవలు అందించడానికి సంస్థ కట్టుబడి ఉందన్నారు. రైతుల సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

విద్యార్థి అమరుల పోరాట స్ఫూర్తితో ముందుకు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై విప్లవ విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. కోటగల్లి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో పిడిఎస్‌యు విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల కాలంలో పిడిఎస్‌యు విద్యార్థి సంఘం శాస్త్రీయ విద్యావిధానం, అసమానతలు లేని సమాజం కోసం విద్యారంగ సమస్యలపై పోరాడుతూ అనేక మంది విద్యార్థి రత్నాలు అమరులయ్యారని అన్నారు. వారి స్ఫూర్తితో ముందు ముందు విద్యార్థుల సమస్యలపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవిక, రమ్య, శ్రీజ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సమీపంలో అగ్ని ప్రమాదం

ఖిల్లా, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మార్కెట్ కమిటీ వద్ద శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. మార్కెట్ కమిటీ కార్యాలయం వెనుక పెద్ద ఎత్తున చెత్త కుప్పలు ఉండటంతో సాయంత్రం అకస్మాత్తుగా అందులో నుంచి భారీ మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. భారీగా పొగలు రావడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు.

జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ తదితరులు కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య,

మోపాల్: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్‌చేసి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పండ్ల పంపిణీ చేశారు. అలాగే రూరల్ మండలంలోని గుండారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, బాడ్సీ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తెలంగాణ వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో, వర్సిటీ జేఏసీ అధ్యక్షుడు పుప్పల రవి, సాగర్ ప్రొఫెసర్‌లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జేఏసీ అధ్యక్షుడు పుప్పల రవి మాట్లాడుతూ.. అతి తక్కువ కాలంలో 50వేల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ కనకయ్య, రవీందర్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది నరేశ్, రవీందర్, హరిశ్, జనార్దన్, నవీన్ రాజు, కుసాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలో సీఎం పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు, రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వేల్పూర్,, నవంబరు8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లులో భారీగా పీడీఎస్‌యు బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉన్న వజ్రా రైస్‌మిల్లులో పీడీఎస్‌యు బియ్యం రీసైక్లింగ్ జరుగుతుందన్న సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక పోలీసులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు తనిఖీలు కొనసాగించారు. కాగా ఇప్పటి వరకు మొత్తం 560క్వింటాళ్ల పైబడి పీడీఎస్‌యు బియ్యం ఉంటుందని సమాచారం. గతంలో ఇదే రైస్‌మిల్లులో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించగా పెద్దమొత్తంలో బియ్యం పట్టుబడిన విషయం తెలిసిందే. అయినప్పటికీ మిల్లు యాజమాని తీరు మార్చుకోలేదు. దార్జగా రీసైక్లింగ్ నిర్వహించడం గమనార్హం.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థి

సిరికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంపల్లి హైస్కూల్‌కు చెందిన హాకీ క్రీడాకారుడు ఎస్కె అర్బాస్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ నాగేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో ఈనెల 5, 6, 7 తేదీలలో సంగారెడ్డి జిల్లాలో జరిగిన పోటీలలో మంచి ప్రతిభకనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నాగేష్ తెలిపారు. జాతీయ స్థాయి హాకీ పోటీలు ఈనెల మూడవ వారంలో హర్యానా రాష్ట్రంలోని రోహతక్‌లో జరుగనున్నాయని ఆయన పేర్కొన్నారు. తూంపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఇంచార్జి ఎంఈవో రాములు, ఉపాధ్యాయ బృందం అర్బాస్‌ను అభినందించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

స్కౌట్స్, గైడ్స్ జూబ్లీ వేడుకలకు విద్యార్థులు

సిరికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో ఈనెల 9 నుంచి11 వరకు స్కౌట్స్ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలకు సిరికొండ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సయ్య తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించే కార్యక్రమానికి సిరికొండ పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న 75 వసంతాల స్కౌట్స్ మరియు గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవ డైమండ్ జూబ్లీ వేడుకలకు నిజామాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర ప్రతినిధి సాల్మాన్, గైడ్ కెప్టెన్ వనిత ఆధ్వర్యంలో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు.


రైల్వే గేటు ఎదుట నిలిచిన వాహనాలు

మాధవనగర్ రైల్వే గేట్ వద్ద తరచూ ట్రాఫిక్ జాం

- పాత గేటు మొరాయించడంతో తొలగింపు
- నూతన గేటు ఏర్పాటు చేసినా.. పని చేయని వైనం
- కొనసాగుతున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు
- వాహనదారుల రాకపోకలకు తప్పని ఇక్కట్లు

డిచ్‌పల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు రైల్వే వంతెన నిర్మాణ పనులు కొనసాగుతుండటం.. మరో వైపు రైల్వే గేటు మరమ్మతులు.. ఫలితంగా నాలుగు రోజులుగా వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పాత రైల్వే గేటు తరచూ మొరాయించడంతో దానిని తొలగించి నూతన గేటును ఏర్పాటు చేస్తున్నారు. అయితే అది పూర్తి స్థాయిలో పనిచేయకపోవడంతో రైల్వే సిబ్బంది రైళ్లు వెళ్తున్న సమయంలో రెండు వైపులా గేటును ఎత్తడం, దించడం చేస్తున్నారు. దీంతో రాకపోకలకు కొంత జాప్యం జరుగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం మహారాష్ట్రకు చెందిన అంబులెన్స్ నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా గేటును వేస్తుండటంతో వాహనదారులు వారించారు. అంబులెన్స్‌కు దారి ఇవ్వాలని కోరారు. రైల్వే అధికారులు వెంటనే ఎలక్ట్రికల్ గేటు ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పోలీస్ లైన్ పాఠశాల తనిఖీ



నిజామాబాద్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శుక్రవారం నగరంలోని జిపిఎస్, జిహెచ్ఎస్ పోలీస్ లైన్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అటెండెన్స్ రిజిస్టర్‌లను, మధ్యాహ్న భోజన నిర్వహణను ఆయన పరిశీలించారు.

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాల తనిఖీ

నిజామాబాద్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వృత్తి విద్య కోర్సుల్లో భాగంగా వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రాలను డిఐఈవో రవికుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. నగరంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలకు చెందిన ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ విద్యార్థినిలు కంప్యూటర్ వృత్తినైపుణ్య శిక్షణ పొందుతున్న వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్‌ను ఆయన తనిఖీ చేశారు. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో నర్సింగ్ శిక్షణతో పాటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేస్తున్న విద్యార్థినిలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ తదితరులు ఉన్నారు.

గిరిరాజ్‌లో అవగాహన సదస్సు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాలలో లభించే సదుపాయాలు స్కాలర్‌షిప్, సాంస్కృతిక కార్యక్రమాల గురించి వివరించారు. పరీక్ష విధానం, విద్యార్థుల విధి విధానాలు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ రామ్మోహన్, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, రఫీక్, భరత్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.265	రూ.285
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.270	రూ.290





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.80500	రూ.74200	రూ.970

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 6.45, 10.15)
: క (3.30)
స్క్రీన్-2 : అమరన్ (10.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (1.30)
: లక్కీ భాస్కర్ (4.15, 7.30, 10.45)
స్క్రీన్-3 : సింగం అగేన్ (హిందీ) (10.50)
: ధూంధాం (2.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (5.00)
: జితేందర్ రెడ్డి (7.45)
: క (10.45)
స్క్రీన్-4 : బూల్ బులియా-3 (హిందీ) (10.00, 7.05)
: వంచన (1.25), : బ్లడీ బగ్గర్ (4.05)
: సింగం అగేన్ (హిందీ) (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (10.35)
: లక్కీ భాస్కర్ (1.30, 7.30)
: క (4.30, 10.30)
స్క్రీన్-3 : అమరన్ (10.30, 10.35)
: జితేందర్‌రెడ్డి (1.40)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (7.35)



దేవి : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 6.15)
: సింగం అగేన్ (హిందీ) (2.15, 9.15)
విజయ్: క (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్